సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 22 । జనవరి । 2023



అటవీ ఉద్యోగుల క్రీడలు షురూ..

పాల్వంచలోని నవభారత్ పబ్లిక్ స్కూల్‌లో అటవీ శాఖ ఉద్యోగుల జోనల్ స్థాయి క్రీడా పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి.
10లో



క్రీడలతో మానసికోల్లాసం

క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పసువులేటి చంద్రశేఖర్‌ప్రసాద్ అన్నారు.
8లో



వాతావరణం

జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి వేళలో మాత్రం చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.

వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం



కల్యాణ వేడుక జరిపిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని శనివారం వైభవంగా జరిపించారు. శ్రీవారికి ఉదయం పంచామృతాభిషేకం, అర్చన నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణ వేడుకను జరిపించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.

సరికొత్త సమస్య!

నూతన పట్టాదారులకు అందని రైతుబంధు

- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు
- యాసంగి పెట్టుబడికి తప్పని కష్టాలు
- అధిక వడ్డీలకు అప్పు తీసుకుంటున్న రైతులు



సూపర్‌బజార్(కొత్తగూడెం): ధరణి వెబ్‌సైట్‌లో పేరు మార్చుకునేందుకు అనేక ఇబ్బందులు పడి.. ఎట్టకేలకు కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు ఇప్పుడు రైతుబంధు సాయం అందక ఇబ్బంది పడుతున్నారు. యాసంగి సీజన్ పంటల సాగుకు పెట్టుబడి ఖర్చుల కోసం తిప్పలు తప్పడం లేదని అంటున్నారు. ప్రభుత్వం ఆదుకోకపోవడంతో అధిక వడ్డీలకు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ యాసంగి సీజన్‌కు సంబంధించి జిల్లాలో 1,41,206 మంది రైతులు రైతుబంధు పథకానికి అర్హులుగా అధికారులు తేల్చారు. వీరితో పాటు ధరణి వెబ్‌సైట్‌లో మార్పులు, చేర్పులతో మరో 1,445 మంది రైతులు నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొంది రైతుబంధు పథకానికి సైతం దరఖాస్తు చేసుకున్నారు. అయితే వ్యవసాయ శాఖ అధికారులు యాసంగి సీజన్‌లో గుర్తించిన అర్హుల జాబితాలో ఈ రైతుల పేర్లు పొందుపర్చలేదు. ఇదేంటని అడిగితే.. పట్టాదారు పాస్ పుస్తకాలు తీసుకున్న రైతుల లిస్ట్ తమకు రెవెన్యూ శాఖ నుంచి రావాలని, ఆ జాబితా ప్రకారం రైతులు ప్రభుత్వ సాయం కోసం దరఖాస్తు చేసుకుంటే ఆ వివరాలను తాము ఎంట్రీ చేస్తామని చెబుతున్నారు. ఇలా ఇరు శాఖల సమన్వయ లోపంతో 'కొత్త' రైతులకు కష్టాలు తప్పడం లేదు.

ఆందోళనలో అన్నదాతలు..

ఇంతకాలం ధరణి వెబ్‌సైట్‌తో అనేక ఇబ్బందులు పడ్డామని, ఎట్టకేలకు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందినా ఇప్పుడు ప్రభుత్వం సాయం అందడం లేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి రూ.5 వేల చొప్పున ఖాతాల్లో ఎప్పుడు పడతాయోనని ఎదురుచూస్తున్న తమకు చివరకు నిరాశే మిగులుతోందని అంటున్నారు. అయితే కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలకు పొందిన రైతులకు ప్రస్తుతానికి రైతుబంధ సాయం ఆపేయాలని గత డిసెంబర్ 25న ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్లు సమాచారం.

కొత్త రైతుల వివరాలిలా..

జిల్లాలో నూతనంగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతుల వివరాలు మండలాల వారీగా ఇలా ఉన్నాయి. ఆళ్లపల్లి మండలంలో 15 మంది, అన్నపురెడ్డిపల్లిలో 28, అశ్వాపురంలో 52, అశ్వారావుపేటలో 142, భద్రాచలంలో నలుగురు, బూర్గంపాడు మండలంలో 73 మంది, చండ్రుగొండలో 103, చర్లలో 67, చుంచుపల్లిలో 18, దమ్మపేటలో 134, దుమ్ముగూడెంలో 97, గుండాలలో 26, జూలూరుపాడులో 60, కరకగూడెంలో 122, కొత్తగూడెంలో 10, లక్ష్మీదేవిపల్లిలో 30, మణుగూరులో 19, ములకలపల్లిలో 93, పాల్వంచలో 58, పినపాకలో 40, సుజాతనగర్‌లో 111, టేకులపల్లిలో 87, ఇల్లెందు మండలంలో 56.. మొత్తం 1445 మంది ఉన్నారు.

రైతుబంధు సాయం అందలేదు



నాకు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకం వచ్చింది. కానీ బ్యాంకు ఖాతాలో రైతుబంధు డబ్బు ఇప్పటివరకు పడలేదు. నాకు ఎకరం ఎనిమిది కుంటల భూమి ఉంది. ప్రభుత్వం నిర్దేశించిన గడువుకు ముందే సాయం కోసం దరఖాస్తు చేసుకున్నా. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ సాయం అందేలా చూడాలని కోరుతున్నా.

– బుడగం శేఖర్, పెనగడప, చుంచుపల్లి మండలం

మాకు జాబితా రాలేదు



జిల్లాలో కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులకు సంబంధించి చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్‌ఏ) నుంచి మాకు లిస్టు రాలేదు. అక్కడి నుంచి వస్తేనే మేము ఎంట్రీ చేసి రైతుబంధు అర్హుల జాబితాలో పేర్లు పంపిస్తాం. ఇప్పటి వరకైతే మాకు ఎలాంటి సమాచారం లేదు.

– కొర్స అభిమన్యుడు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి

ఆర్టీసీకి సంక్రాంతి జోష్

వారం రోజుల్లో రూ.36.78 లక్షల ఆదాయం



కొత్తగూడెం బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

చుంచుపల్లి: ఆర్టీసీకి సంక్రాంతి కలిసొచ్చింది. వారం రోజుల్లో అత్యధిక ఆదాయం రాబట్టింది. పండుగ సందర్భంగా అధికారులు ముందస్తు ప్రణాళికలతో కొత్తగూడెం డివిజన్ నుంచి 188 ప్రత్యేక సర్వీసులను వివిధ ప్రాంతాలకు తిప్పారు. ఇందులో కొత్తగూడెం డిపో నుంచి 63, భద్రాచలం నుంచి 79, మణుగూరు డిపో నుంచి 46 బస్సులు ఉన్నాయి. ఈ ప్రత్యేక సర్వీసుల్లో 50 శాతం పైగా హైదరాబాద్ రూట్‌కే నడిపారు. హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ, ఏపీలోని పలు ప్రాంతాల్లో ఉంటున్న జిల్లా వాసులు సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వచ్చారు. దీంతో వారం రోజుల పాటు ఆర్టీసీలో ప్రయాణికుల సందడి కనిపించింది. ఈ ఏడాది ప్రారంభంలోనే సంక్రాంతి సందర్భంగా ఆర్టీసీకి భారీగా ఆదాయం రావడంతో అధికారులు, సిబ్బందిలో జోష్ నింపింది.

కిటకిటలాడిన బస్టాండ్లు..

సంక్రాంతి సందర్భంగా ఆర్టీసీ అధికారులు ముందస్తుగా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినా.. ఈనెల 11 నుంచి మూడు రోజుల పాటు జిల్లాకు వచ్చే ప్రయాణికుల తాకిడి పెరిగింది. ముఖ్యంగా 12 ,13 తేదీల్లో కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, పాల్వంచ, ఇల్లెందు బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. రద్దీ పెరగడంతో అధికారులు అప్పటికప్పుడు మరికొన్ని బస్సులను కూడా ఏర్పాటు చేశారు. పండుగ సీజన్ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు బస్టాండ్లలో సిబ్బందికి ప్రత్యేక డ్యూటీలు వేశారు. దీంతో సిబ్బంది దగ్గరుండి ప్రయాణికులను బస్సుల్లోకి ఎక్కించారు. ఇక తిరుగు ప్రయాణంలో సైతం ప్రయాణికుల తాకిడి మరింతగా కనిపించింది. 16, 17, 18 తేదీల్లో జిల్లా నుంచి భారీగా తమ పని ప్రదేశాలకు తిరిగి వెళ్లారు. మొత్తంగా పండుగకు ముందు మూడు రోజులు.. తర్వాత మూడు రోజుల్లో ఆర్టీసీకి అధిక ఆదాయం వచ్చింది. జిల్లాలోని మూడు డిపోల పరిధిలో ప్రత్యేక బస్సుల ద్వారా రూ.36,78,694 ఆదాయం సమకూరింది. ఇందులో భద్రాచలం డిపో అత్యధికంగా రూ.18,71,990, మణుగూరు డిపో రూ.11,39,310, కొత్తగూడెం డిపో రూ. 6,67,394 చొప్పున ఆదాయాన్ని రాబట్టాయి. గతేడాది మాదిరిగానే ఈ సారి కూడా పండుగ ప్రత్యేక బస్సుల్లో అదనపు చార్జీలను ఎత్తివేయడంతో ప్రయాణికులు ఎక్కువ సంఖ్యలో ఆర్టీసీని ఆదరించారు.

అలరించిన బాలోత్సవ్



బాలోత్సవ్‌కు హాజరైన విద్యార్థులు

80 పాఠశాలల నుంచి 264 మంది విద్యార్థుల హాజరు



వేడుకలను ప్రారంభిస్తున్న రమేష్‌బాబు తదితరులు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం క్లబ్‌లో శనివారం ప్రారంభమైన జిల్లా స్థాయి బాలోత్సవ్‌కు అనూహ్య స్పందన లభించింది. తొలిరోజు పోటీలకు జిల్లాలోని 80 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 264 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిని గ్రూపులుగా విభజించి కథలు, కవితల రచన గురించి నిర్వాహకులు తెలియజేశారు. అనంతరం నిర్వహించిన కవిత, రచనల పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉభయ రాష్ట్రాలకు చెందిన ప్రముఖ కవులు, కథకులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా బాలోత్సవ్ కన్వీనర్ డాక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలతో పిల్లలకు చిన్నప్పటి నుంచే రచనల పట్ల ఆసక్తి పెరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విజయవాడకు చెందిన రచయిత అనిల్ డ్యానీ, హైదరాబాదుకు చెందిన కథా రచయితలు కరుణ తాయమ్మ, చందు తులసి, దాచేపల్లికి చెందిన రవికుమార్, ఖమ్మానికి చెందిన కవి కటకోజ్వల రమేష్, కొత్తగూడేనికి చెందిన భగవంత్ పాల్గొన్నారు. అనంతరం వరంగల్‌కు చెందిన తూములూరి వెంకటేశ్వరావు రచించిన 'దేశానికి అశ్రు లేఖ' కవితా సంపుటిని, ముత్యాలంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు చిట్టి మధు రచించిన 'నాలో నేను' పుస్తకాలను డాక్టర్ రమేష్‌బాబు ఆవిష్కరించారు.

ఆనందంగా ఉంది



బాలోత్సవ్‌లో పాల్గొనడం ఆనందంగా ఉంది. కథలు ఎలా రాయాలనే అంశాలను వర్క్‌షాపులో నేర్పించారు. నేను స్నేహం కోసం ఒక కథ రాశాను. కథల పోటీల్లో గెలుపొందుతాననే నమ్మకం ఉంది.

– కె.గోపిజోషి, పాల్వంచ

కుటుంబ విలువలు తెలిపే కథ రాశా..



బాలోత్సవ్ పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది. కథా రచనలో ఇక్కడ మెళకువలు నేర్పారు. కథలు రాయడమెలా అనే అంశాలను ఇక్కడి వర్క్‌షాప్‌లో నేర్చుకున్నా. కుటుంబ విలువలు తెలిపే కథ రాశా. బహుమతి వస్తుందనే నమ్మకం ఉంది.

– టి.దుర్గామౌనిక, హేమచంద్రాపురం

ఎంతో ఉపయోగకరం



బాలోత్సవ్ లాంటి వేదికలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం. రచలను ఎలా చేయాలో తెలుసుకుంటే భవిష్యత్తులో మంచి రచయితలుగా ఎదగొచ్చు. కొత్తగూడెంలో బాలోత్సవ్ నిర్వహించడం ఇక్కడి పిల్లల అదృష్టం.

– అనిల్ డ్యానీ, రచయిత

సమస్యలుంటే తక్షణమే స్పందించాలి

కంటి వెలుగు క్యాంపుల నిర్వహణపై కలెక్టర్ అనుదీప్



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): కంటి వెలుగు ప్రత్యేక క్యాంపుల నిర్వహణకు కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ అనుదీప్ వైద్యాధికారులను ఆదేశించారు. శిబిరాల నిర్వహణపై ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ డాక్టర్ శాంతికుమారి శనివారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అనుదీప్ పాల్గొని జిల్లాలో చేపట్టిన చర్యల గురించి వివరించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కంటివెలుగు నిర్వహణపై ఏమైనా సమస్యలు ఉంటే అధికారులు స్పందించి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో కార్యక్రమం బాగా జరుగుతోందని అధికారులకు అభినందనలు తెలిపారు. గత రెండు రోజులుగా నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో 12,235 మందిని పరీక్షించారని, వారిలో రీడింగ్ సమస్య ఉన్న 4,522 మందికి వెంటనే కళ్లజోళ్లు అందజేశారని వివరించారు. 1879 మందికి ప్రత్యేక కళ్లజోళ్ల కోసం ఆర్డర్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష, డీపీఓ రమాకాంత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

11 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్: ఫిబ్రవరి 11 నుంచి 14 వరకు జిల్లా కేంద్రంలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఇ.సోమశేఖరశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లోయర్, హయ్యర్, డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడింగ్ పరీక్షలు ఉంటాయని వివరించారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వెబ్‌సైట్‌లో హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఆదివాసీ పూజారులకు గౌరవ వేతనం ఇవ్వాలి

గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాబూరావు



మాట్లాడుతున్న మిడియం బాబూరావు

చర్ల: ఆదివాసీ గిరిజన పూజారులను ప్రభుత్వం గుర్తించి గౌరవ వేతనం చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబూరావు డిమాండ్ చేశారు. చర్ల మండల కేంద్రంలో శనివారం జరిగిన ఆదివాసీ పూజారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. హిందూ సంస్కృతికి, ఆదివాసీ సంస్కృతికి తేడా ఉంటుందని, ఆదివాసీలు ప్రకృతినే నమ్ముకుని వారి ఇలవేల్పులను వంశపారంపర్యంగా ఆరాధిస్తుంటారని చెప్పారు. హిందూ దేవాలయాల పూజారులకు ధూప, దీప నైవేద్య పథకం కింద ఇస్తున్న గౌరవ వేతతనాన్ని ఆదివాసీలకు కూడా వర్తింపజేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ఇర్పా జగపతిరావు, సరియం కోటేశ్వరావు, కారం నరేష్, పూజారి ప్రమీల, సోయం రాధ, వరదల వరలక్ష్మి, కూరం మహాలక్ష్మి, కారం నాగేశ్వరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు 'పొంగులేటి' ఆత్మీయ సమ్మేళనం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య,విజయ్‌బాబు, బ్రహ్మయ్య

ఇల్లెందు: పట్టణంలోని లలితాపురం మామిడి తోటలో ఈ నెల 23వ తేదీన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నారని, దీనిని విజయవంతం చేయాలని ఎంపీటీసీ సభ్యులు పూనెం సురేందర్, మండల రాము, కృష్ణప్రసాద్, తాటి రాంబాబు, సూర్నబాక సత్యనారాయణ, ధనుంజయ్, తాటి భిక్షం, ఎస్.నర్సింహారావు, నాగార్జున, ముక్తి కృష్ణ కోరారు. శనివారం కోరం కనకయ్య క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆత్మీయ సమ్మేళనానికి కోరం కనకయ్య హాజరవుతారని తెలిపారు. జిల్లా, నియోజకవర్గ, మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కౌన్సిలర్‌లు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఏర్పాట్ల పరిశీలన

ఆత్మీయ సమ్మేళనం ఏర్పాట్లను జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, మువ్వా విజయ్‌బాబు, తుళ్లూరి బ్రహ్మయ్య శుక్రవారం పరిశీలించారు. ఇదిలా ఉండగా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్ ఆధ్వర్యంలో ఈ నెల 28న పట్టణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిసింది.

నేడు భద్రాద్రిలో న్యాయవాదుల మహాసభ

భద్రాచలంఅర్బన్: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రథమ మహాసభ భద్రాచలంలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనింగ్ కమిటీ బాధ్యులు వెల్లడించారు. భద్రాచలంలోని గిరిజన అభ్యుదయ సంఘం భవనంలో జరిగే మహాసభలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ ప్రారంభిస్తారని, ఓయూ లా పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గుమ్మడి అనురాధ, ఐలు ప్రధాన కార్యదర్శి కొల్లి సత్యనారాయణ పాల్గొంటారని తెలిపారు. న్యాయవాదులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తేనెటీగల పెంపకంపై శిక్షణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా రైతులు, యువత, మహిళలకు ఈ నెల 24, 25 తేదీల్లో తేనెటీగల పెంపకంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ శనివారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తమ వివరాలను 99896 33364 నంబర్‌కు ఫోన్ చేసి లేదా మెసేజ్ ద్వారా పంపి నమోదు చేసుకోవాలని సూచించారు.

మద్యం దుకాణం సీజ్



ఎక్సైజ్ అధికారులు సీజ్ చేసిన వైన్ షాపు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఐటీడీఏ రోడ్ శివాలయం ఎదురుగా ఉన్న ఓ మద్యం దుకాణాన్ని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం శనివారం సీజ్ చేశారు. వినియోగదారుల నుంచి అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారనే ఫిర్యాదులు రావడంతో అధికారులు నిఘా పెట్టారు. మూడు రోజుల పాటు మద్యం విక్రయాలను గమనించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం అధిక ధరకు మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీంతో షాపు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వరరావు తెలిపారు.

ఆటో బోల్తా



గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

అశ్వారావుపేటరూరల్: ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఊట్లపల్లి సమీపంలోని వెంకమ్మచెరువు వద్ద గల పొలానికి వెళ్లిన కొందరు తిరుగుప్రయాణంలో ఆటోలో వస్తున్నారు. మార్గమధ్యలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బేతి శంకర్, రవి, లక్ష్మీకి గాయాలు కాగా, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. వైద్యులు చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,881

కూలిన కలల సౌధం

- బతుకుపోరులో ప్రాణాలు విడిచిన యువకులు
- పెద్దదిక్కు కోల్పోయి కన్నీటి పర్యంతమవుతున్న కుటుంబాలు
- ఇల్లెందు ఆస్పత్రిలో మిన్నంటిన రోదనలు



శివకోటి (ఫైల్)



బైరి రాము (ఫైల్)



ఓదెల కల్యాణ్ (ఫైల్)



అరవింద్ (ఫైల్)

ఇల్లెందురూరల్: వారంతా 20 – 35 ఏళ్ల మధ్య వయసున్న యువకులు.. పనిచేస్తేనే బతుకు బండిని లాగే నిరుపేద కుటుంబాలు.. పొట్టకూటి కోసం ఫొటోగ్రఫీని వృత్తిగా ఎంచుకుని వృత్తిలో ఇప్పుడిప్పుడే రాణిస్తున్నారు. ఇంతలోనే విధి వక్రీకరించి వారి కలల సౌధాన్ని కూల్చివేసింది. రోడ్డు ప్రమాద రూపంలో కుటుంబాలను వీధి పాలు చేసింది. చిన్న వయసులోనే కొడుకులు దూరమైన తల్లిదండ్రులు, భర్తలను కోల్పోయిన యువతుల ఆర్తనాదాలు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తున్నాయి. మధుర జ్ఞాపకాలను, తీపి గుర్తులను ఫొటోల రూపంలో అందించే వారు.. ఇక అదే ఫొటోల్లో మాత్రమే కనిపించనున్నారు. ఇల్లెందు మండలం కోటిలింగాల సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నలుగురిని బలి తీసుకోగా, మరొకరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శనివారం తెల్లవారుజామునే ఆస్పత్రికి చేరుకున్న వారి కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. బాధిత కుటుంబాలను ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ, ఏఎంసీ చైర్మన్ హరిసింగ్, మున్సిపల్ చైర్మన్ డి.వెంకటేశ్వరరావు పరామర్శించగా, ఫొటోగ్రాఫర్ల సంఘం ప్రతినిధులు నల్లబ్యాడ్జీలు ధరించి సంతాపం తెలిపారు.

ఆవిరైన చిన్నమ్మ ఆశలు..

వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ద్వారకపేటకు చెందిన ఓదెల కమలాకర్ అలియాస్ కల్యాణ్ (28) చిన్నవయసులోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. అదే సమయాన భర్తను కోల్పోయిన కల్యాణ్ చిన్నమ్మ ఓదెల కోమల ఆయనను దత్తత తీసుకుంది. ఇంటర్ వరకు చదువుకున్న కల్యాణ్ ఫొటోగ్రఫీలో మెళకువలు నేర్చుకుని పెళ్లయ్యాక వరంగల్‌కు మకాం మార్చాడు. భార్య, కూతురు, చిన్నమ్మతో కలిసి సంతోషంగా ఉంటున్న సమయంలో రోడ్డు ప్రమాదం ఆయనను బలితీసుకుంది. దీంతో పెద్దదిక్కు కోల్పోయిన చిన్నమ్మ కోమల, భర్త దూరమైన మౌనిక, తండ్రికి ఏమైందో తెలియక చిన్నారి అంజిత రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

ప్రేమించి పెళ్లి చేసుకున్న నెలకే..

హనుమకొండ జిల్లా కమలాపూర్‌కు చెందిన బోళ బత్తిని అరవింద్ (21) ఇంటర్ వరకు చదువుకున్నాడు. ప్రేమించిన యువతిని పెద్దల అంగీకారంతో గత డిసెంబర్ 17న పెళ్లి చేసుకున్నాడు. జీవితంలో స్థిరపడాలనే ఆకాంక్షతో ఫొటోగ్రఫీ నేర్చుకోవాలని భావించి, మిత్రులతో కలిసి ఫొటోషూట్‌కు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం మింగేసింది. ఒక్కగానొక్క కుమారుడిని గారాబంగా పెంచామని, కోరుకున్న యువతితో పెళ్లి చేయగా.. ఇంతలోనే ఈ ఘోరం జరిగిందని తల్లిదండ్రులు విలపిస్తున్న తీరు కలచివేసింది. ఇక వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన కొంపెల్లి శివకోటి (31)కి ఎనిమిదేళ్ల కిందట వివాహం జరగగా, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఫొటోగ్రఫీలో మెరుగైన జీవనం కోసం వరంగల్‌కు మకాం మార్చాడు. అద్దె ఇంట్లో ఉంటున్న ఆయన ఫొటోగ్రఫీలో గత జాతీయస్థాయి అవార్డు అందుకున్నాడు. వెడ్డింగ్ షూట్ కోసం బయలుదేరి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోగా భార్య, పిల్లలు దిక్కులేని వారయ్యారు. మృతుల్లో మరో వ్యక్తి హనుమకొండ జిల్లా కమలాపురం గ్రామానికి చెందిన బైరి రాము (32) కూడా ఫొటోగ్రఫీలో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. పదిహేనేళ్లుగా ఇదే రంగంలో జీవనం సాగిస్తున్న ఆయనకు భార్య రజిని, పాప, బాబు ఉండగా కుటుంబంతో సహా వరంగల్‌లో ఉంటున్నాడు. ఉన్నంతలో జీవనం సాఫీగా సాగుతున్న సమయాన రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాన్ని ఛిద్రం చేసింది.

హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ..

వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ద్వారకపేటకు అబ్బునాపురం క్రాంతి (22) తన స్నేహితుడైన కల్యాణ్‌తో కలిసి ఫొటోగ్రఫీ నేర్చుకోవాలని భావించాడు. వృత్తిలో మెళకువలు నేర్చుకునేందుకు శుక్రవారం మిత్రుడితో కలిసి ఫొటోషూట్‌కు వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను శనివారం ఉదయం ఖమ్మం ఆస్పత్రి నుంచి హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు.



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ



భార్యను ఓదారుస్తున్న మృతుడు అరవింద్ తండ్రి శ్రీనివాస్



రోదిస్తున్న కళ్యాణ్ కుటుంబసభ్యులు



మృతదేహాల వద్ద నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

రామయ్యను దర్శించుకున్న బీజేపీ నాయకులు



ఆలయంలో బీజేపీ కేంద్ర, రాష్ట్ర నాయకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని శనివారం బీజేపీ కేంద్ర, రాష్ట్ర నాయకులు దర్శించుకున్నారు. బీజేపీ జాతీయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర సహాయ ఇన్‌చార్జ్ అరవింద్ మీనన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి, రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యవతి అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాలలో పూజలు చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో పార్టీ భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లా అధ్యక్షులు కోనేరు సత్యనారాయణ, గల్లా సత్యనారాయణ, ఉప్పల శారద, ఎర్రం రాజుబెహారా, నాగబాబు, చెరుకూరు సతీశ్, త్రినాథరావు, రమేశ్, రామలింగేశ్వరరావు, మునిశెట్టి రామ్మోహన్‌రావు, పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి వితరణ

దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్‌లోని సలీమ్‌నగర్‌కు చెందిన ఎరుకుల చినరాముడు రూ.50 వేలను ఆలయ అధికారులకు విరాళంగా అందజేశారు.

మహిళా మావోయిస్టు లొంగుబాటు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా డిస్ట్రిక్ట్ ఫోర్స్ ఎస్టీఎఫ్, కోబ్రా 208 బెటాలియన్ అధికారుల ఎదుట మావోయిస్టు బెటాలియన్ సభ్యురాలు వెట్టి మంగి శనివారం లొంగిపోయింది. సుకుమా ఎస్పీ సునీల్‌శర్మ నేతృత్వాన 'లోన్‌వారట్'పేరిట మావోయిస్టులు లొంగిపోయేలా అవగాహన కల్పిస్తున్నారు. రూ.8 లక్షల రివార్డు కలిగిన మంగి లొంగిపోవడంతో భద్రతా బలగాలు భారీ విజయం సాధించినట్లయింది. ఆమె లొంగిపోయిన విషయాన్ని ఏఎస్పీ కిరణ్ చవాన్ ధ్రువీకరించారు.


గుండెపోటుతో ఐటీసీ కాంట్రాక్ట్ కార్మికుడి మృతి



ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న బూర్గంపాడుకు చెందిన కేసుపాక వెంకటేశ్వర్లు.. శుక్రవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి తిరిగివస్తుండగా గుండెపోటుకు గురయ్యారు. గమనించిన తోటి కార్మికులు భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలిసిన మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి నుంచి మృతదేహాన్ని ఐటీసీ పీఎస్‌పీడీ మెయిన్‌గేట్ వద్దకు తీసుకువచ్చి ఆందోళన చేపట్టారు. మృతుని కుటుంబాన్ని ఐటీసీ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మృతుని కుటుంబీకులకు ఉద్యోగం, ఆర్థిక సాయం ప్రకటించాలని మూడుగంటల పాటు ఆందోళన చేపట్టారు. సమాచారం తెలిసిన ఎస్‌ఐ సంతోష్ అక్కడకు చేరుకుని ఆందోళన చేస్తున్న మృతుని బంధువులతో మాట్లాడారు. అనంతరం ఐటీసీ మేనేజ్‌మెంట్‌ను, ట్రేడ్ యూనియన్ల నాయకులను పిలిచి మాట్లాడారు. రెండుగంటల పాటు చర్చలు సాగిన తరువాత మృతుని కుటుంబాన్ని ఆదుకునేందుకు ఐటీసీ మేనేజ్‌మెంట్ అంగీకరించటంతో ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్ట్‌మార్టం నిర్వహించారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. డ్యూటీకి వెళ్లిన వ్యక్తి ఇంటికి రాకుండానే గుండెపోటుతో మృతిచెందాడనే విషయాన్ని కుటుంబసభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. వెంకటేశ్వర్లు మృతితో బూర్గంపాడులో విషాదం అలుముకుంది. మృతదేహాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత సందర్శించి నివాళులర్పించారు. గొనెల నాని, భూపెల్లి నర్సింహారావు, వలదాసు సాలయ్య, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, కేసుపాక వెంకటరమణ తదితరులున్నారు.

వాహనాలను తగలబెట్టిన మావోయిస్టులు



మావోయిస్టులు దగ్ధం చేసిన వాహనాలు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా చింతల్నార్ అటవీ ప్రాంతంలో రోడ్డు నిర్మాణ పనులకు ఉపయోగిస్తున్న రెండు వాహనాలను మావోయిస్టులు దగ్ధం చేశారు. చింతల్నార్–మోర్పల్లి రోడ్డులో కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టగా, శనివారం అక్కడకు వచ్చిన మావోయిస్టులు కార్మికులను దూరంగా పంపించి వాహనాలకు నిప్పు పెట్టారు. అయితే, అక్కడ పోలీసుల భద్రత లేకుండానే కాంట్రాక్టర్ పనులు చేస్తున్నట్లు తెలియగా, అటవీప్రాంతంలో భద్రత లేకుండా అభివృద్ధి పనులు చేపట్టవద్దని జేగురుగొండ ఎస్‌డీఓపీ విజయ్ రాజ్‌పుత్ కాంట్రాక్టర్లకు సూచించారు.

గాయపడిన లారీడ్రైవర్ మృతి

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ లారీడ్రైవర్ మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. అశ్వారావుపేట–సత్తుపల్లి ప్రధాన రహదారిలో ఈ నెల 19వ తేదీ తెల్లవారుజామున ఖమ్మం వైపు నుంచి ఏపీకి వెళ్తున్న లారీ ఆగి ఉన్న మరో లారీని అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏపీలోని పల్నాడు జిల్లా మాచవరం మండలం వేమవరం గ్రామానికి చెందిన లారీడ్రైవర్ ఏసుబాబు(62)కు గాయాలయ్యాయి. గాయపడిన ఏసుబాబును స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించగా చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న లారీడ్రైవర్ పరిస్థితి విషమించి శనివారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై వివరాలు సేకరించి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ బి.రాజేశ్‌కుమార్ తెలిపారు.

29న 'మారెళ్లపాడు'కు భూమి పూజ

- తుమ్మలచెరువుకు గోదావరి జలాల తరలింపుతో తీరనున్న రైతుల కోరిక
- అశ్వాపురం మండలంలో 16 వేల ఎకరాలకు సాగునీరు



అధికారులతో చర్చిస్తున్న విప్ రేగా కాంతారావు

అశ్వాపురం: మండలంలో సీతారామ ప్రాజెక్ట్ కెనాల్‌కు అనుబంధంగా గొల్లగూడెంలో రూ.25 కోట్లతో మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులకు ఈ నెల 29న ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు భూమి పూజ చేయనున్నారు. సీతారామ ప్రాజెక్ట్ ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాస్ శనివారం మణుగూరులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రేగా కాంతారావును కలిసి ఎత్తిపోతల పథకంపై చర్చించి నిర్మాణ పనులు, ఆయకట్టు వివరాలు వివరించారు. 29న భూమి పూజకు ఎమ్మెల్యే రేగాను ఆహ్వానించారు. మండలంలో గొల్లగూడెం గ్రామంలో సీతారామ ప్రాజెక్ట్ కెనాల్‌కు అనుబంధంగా పంప్‌హౌస్ నిర్మించి ఎలకలగూడెంలో డెలివరీ సిస్టం ఏర్పాటు చేసి, పంప్‌హౌస్ ద్వారా ఎలకలగూడెం నుంచి తుమ్మలచెరువుకు వెళ్లే కాలువలో నీరు వదలనున్నారు. తద్వారా తుమ్మలచెరువును గోదావరి జలాలతో నింపనున్నారు. తుమ్మలచెరువు ద్వారా 10 వేల ఎకరాలు సాగవుతోంది. తుమ్మలచెరువు వర్షాలపైనే ఆధారపడి ఉందని, గోదావరి జలాలు తరలించాలని ఆయకట్టు పరిధిలోని వేల మంది రైతులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా వారి చిరకాల కోరిక తీరనుంది. దివంగత మహానేత వైఎస్సార్ హయాంలో రాజీవ్‌సాగర్ ప్రాజెక్ట్ ద్వారా తుమ్మలచెరువుకు గోదావరి జలాలు తరలించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అదే రాజీవ్‌సాగర్ ప్రాజెక్ట్‌ను ప్రభుత్వం సీతారామ ప్రాజెక్ట్‌గా రీడిజైన్ చేసింది.

5కే రన్‌ను ప్రారంభించిన విప్ రేగా

మణుగూరురూరల్: రేగా విష్ణు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న కేసీఆర్ కప్–2023 క్రీడా పోటీల్లో భాగంగా శనివారం 5కే, 3కే రన్‌లు నిర్వహించారు. వాటిని పీవీ కాలనీలోని అంబేడ్కర్ పార్క్, హనుమాన్ టెంపుల్ వద్ద ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ప్రారంభించి మాట్లాడారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ దేహదారుఢ్యం పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం క్రీడాపోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు, జట్లకు వాలీబాల్ కిట్లను అందజేశారు. అలాగే, మణుగూరు మున్సిపాలిటీ పరిధి రాజుపేటకు చెందిన పి.నరసమ్మ, ఆదర్శనగర్‌కు చెందిన బి.శ్రీనుబాబుకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను విప్ పంపిణీ చేశారు. కాగా, పట్టణంలోని రూ.2 కోట్ల వ్యయంతో సెంట్రల్ లైటింగ్ తదితర పనులు చేపట్టే ప్రాంతాలను అధికారులతో కలిసి విప్ కాంతారావు పరిశీలించారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అడపా అప్పారావు, నాయకులు తాళ్లపల్లి యాదగిరిగౌడ్, ముద్దంగుల కృష్ణ పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయి..

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖర్ ప్రసాద్



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖర్‌ప్రసాద్

కొత్తగూడెంటౌన్: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖర్‌ప్రసాద్ అన్నారు. శనివారం రామవరం సాధన గ్రౌండ్‌లో న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులకు క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖర్ ప్రసాద్ టాస్ వేసి ప్రారంభించి ప్రసంగించారు. రిపబ్లిక్‌డేని పురస్కరించుకుని ఆటల పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.భానుమతి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఆడెపు నీరజ, లక్కినేని సత్యనారాయణ, బాగం మాధవరావు, మునిగడప వెంకటేశ్వర్లు, ఎండీ సాధిక్‌పాషా, కన్నెకంటి శ్రీధర్, గాదె సునంద, ఆర్తిమక్కడ్, పోసాని రాధాకృష్ణ, జలసూత్రం శివరాంప్రసాద్, రమేశ్‌కుమార్, మెండు రాజమల్లు పాల్గొన్నారు.

మ్యాచ్‌ల వివరాలు..

ఉద్యోగులు, న్యాయవాదులను నాలుగు జట్లుగా విభజించి మ్యాచ్‌లను నిర్వహించారు. మొదటి మ్యాచ్‌లో న్యాయవాదుల ఏ–టీం, ఉద్యోగుల బీ–టీం బరిలోకి దిగారు. మొదట బ్యాటింగ్ చేసిన న్యాయవాదులు నిర్ణీత 8 ఓవర్లలో 104 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఉద్యోగులు 70 పరుగులు మాత్రమే చేసి ఓడిపోయారు. తరువాత మ్యాచ్‌లో న్యాయవాదుల బీ–టీం, ఉద్యోగుల ఏ–టీం తలబడ్డాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన ఉద్యోగుల ఏ–టీం నిర్ణీత ఓవర్లలో 89 పరుగులు చేయగా తరువాత బ్యాటింగ్ చేసిన న్యాయవాదుల బీ–టీం 69 పరుగులు చేసి ఓటమి పాలైంది. ఫైనల్ మ్యాచ్‌లో ఉద్యోగుల ఏ–టీం, న్యాయవాదుల ఏ–టీం తలపడ్డాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన న్యాయవాదులు నిర్ణీత 10 ఓవర్లలో 51 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఉద్యోగులు 9 ఓవర్లలోనే 52 పరుగులు చేసి విజయం సాధించారు. ఉద్యోగుల టీం కెప్టెన్‌గా జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖర్‌ప్రసాద్ వ్యవహరించారు. న్యాయవాదుల టీంకు అనుబ్రోలు రాంప్రసాదరావు కెప్టెన్‌గా వ్యవహరించారు.

సభ్యత్వ నమోదు..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టులో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) సభ్యత్వ నమోదును చేపట్టినట్లు శనివారం ఐఏఎల్ జిల్లా నాయకులు యలమోలు ఉదయ్‌భాస్కర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఐఏఎల్ జిల్లా నాయకులు మునిగడప వెంకటేశ్వర్లు, బాగం మాధవరావు, లక్కినేని వెంకటదుర్గారావు, ఉప్పుశెట్టి సునీల్, మారపాక రమేశ్, చిరంజీవరావు, పుల్లయ్య, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.